# ఆటో డ్రైవర్లను మోసం చేస్తే సహించం



2 లో

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 29 జులై, 2026 | పేజీలు :08


# ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలి

**జలసిరి పనులు లక్ష్యం మేరకు పూర్తి**

**సీజనల్ వ్యాధులపై అవగాహన**

**టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, తెలంగాణ జలసిరి పనులు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, సీజనల్ వ్యాధులపై వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, హౌసింగ్ ఏఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో వర్షపాతం వివరాలు, మొత్తం సాగు విస్తీర్ణం, ప్రస్తుతం ఏ ఏ పంటలు వేశారో ఆరా తీశారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న విత్తన మేళాల్లో అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంత లు, పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్), బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో పూర్తి చేయాలని ఆదేశించారు.

### రోజు వారి లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు రోజు వారి లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు వెళ్లాలని అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి, ప్రారంభమైన నిర్మాణాలు, వివిధ దశలు, పూర్తయిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రెండో దశలో మంజూరు చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి చేపడుతున్న ప్రక్రియ వివరాలను ఆరా తీశారు. ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం హౌసింగ్ పీడీ, డీఈ పర్యవేక్షించాలని సూచించారు. గుడిసెలు, రేకుల



షెడ్లలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచిం చారు. ప్రతి ఇంటి నిర్మాణం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

### మండల ప్రత్యేక అధికారులు హాజరుకావాలి

జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న రైతు గ్రామ సభలకు మండల ప్రత్యేక అధికారులు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, సీజనల్ వ్యాధులు, భూగర్భ జలాల పరిస్థితి, తెలంగాణ జలసిరిపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీల అధికారులు ఉన్నారు.

# రూపు రేఖలు మారిన వెల్‌నెస్

- నిజామాబాద్ సెంటర్‌లో కుదించిన వేళలు
- బయటే మెడికల్ బిల్లులు.. జేబులకు చిల్లులు
- పెన్షనర్లు, ఉద్యోగులు, జర్నలిస్టుల తీవ్ర అవస్థలు




**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లు, జర్నలిస్టులకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు ఉచిత మందులు అందించాలనే సదుద్దేశంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్ సేవలు క్రమంగా దిగజారుతున్నాయి. అధికారుల అసంబద్ధ నిర్ణయాలు, కొరవడిన పర్యవేక్షణ వల్ల ప్రాధాన్యత కోల్పోతుందని, బాధితులకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అరకొర వేళలు.. దూర ప్రాంత రోగుల తంటాలు

గతంలో వెల్నెస్ సెంటర్‌లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరంతరాయంగా వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. దీనివల్ల జిల్లాలోని మారుమూల గ్రామాలు, మండలాల నుంచి వచ్చే రోగులకు


తరువాయి 2లో


## కాలానికి అనుగుణంగా..

# తీరొక్క కూరగాయల సాగు

**ప్రజా పక్షం/వేములవాడ:** కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయలు సాగు చేస్తున్నారు వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉండడం, భూ గర్భ జలాలు రానురాను తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు భిన్నంగా నమోదు అవుతున్నాయి. వరి ఇతర పంటలకు సాగు నీరు ఎక్కువ అవసరం అవుతుంది. ఎల్ నినో ప్రభావం, తక్కువ వర్షపాతంతో ఇబ్బందులు అధిగమించేందుకు తనకు ఉన్న ఐదు ఎకరాలను బీడుగా వదిలి వేయవద్దని, తక్కువ నీటితో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలనే ఉద్దేశంతో వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన చెరుకు తిరుపతి అనే రైతు తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేస్తానని నిర్ణయించుకున్నారు. 30 గంటల విస్తీర్ణంలో ప్రస్తుతం బీరకాయ, కాకర కాయ, బెండకాయ, గోరు చిక్కుడు, సోర కాయ, మెంతి



కలెక్టర్ గరిమ అగ్రవాల్


తరువాయి 2లో

## ఆటో డ్రైవర్లను మోసం చేస్తే సహించం

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ టౌన్ :** ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, మోసం చేస్తే సహించేది లేదని టిఎస్ ఆటో రిక్షా డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిటిఓ కార్యాలయంలో ఎఒ అరుణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి అధ్యక్షుడు టి దివాకర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, మహేష్ పాల్గొన్నారు.

## శానిటేషన్ పనులు పరిశీలించిన డిఎల్‌పిఒ

**ప్రజాపక్షం/శంకరపట్నం :** మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో శానిటేషన్ పనులను మంగళవారం హుజురాబాద్ డిఎల్‌పిఓ శ్రీనివాస్ పరిశీలించారు.ఉదయం నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే వారసంతలో వెస్టిజినీ మార్కెట్ ప్రాంతాలలో వ్యాపారులు పడవేస్తున్నారు.ప్రతి మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బందితో శానిటేషన్ పనులు జరుగుతుండగా హుజురాబాద్ డిఎల్‌పిఓ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్రప్రసాద్,కార్యదర్శి నర్సయ్య,వార్డు సభ్యులు సదానందం మెయిన్‌లు ఉన్నారు.

## ఒక్క ఓటు మిస్ కావద్దు

**ప్రజాపక్షం/ జమ్మికుంటః** మున్సిపల్ పరిధిలోని 19, 4వ వార్డులకు చెందిన పోలింగ్ బూత్‌ల్లో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలను కోరారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా ఇంటింటి సర్వే నిర్వహించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మడిపోజు రాజేష్, ఆడెపు దేవరాజ్, శివ పాల్గొన్నారు.

## రైతు వేదికలో ఘనంగా రైతు నేస్తం 100వ ఎపిసోడ్

**ప్రజాపక్షం/ కొత్తపల్లి :** కొత్తపల్లి రైతు వేదికలో ఘనంగా రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు చేయదగిన ప్రత్యామ్నాయ పంటలు, పంటల యాజమాన్య పద్ధతులు మరియు ప్రభుత్వ సూచనలపై రైతులకు వివరించారు.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ డా. పి. మధుకర్ రావు మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు, సమయానుకూల విత్తనం, నేల తేమ సంరక్షణ, నీటి యాజమాన్యం మరియు మండలానికి అనుగుణమైన కాంటింజెన్సీ క్రాప్ ప్లానింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు.డీహెచ్ఎస్ఓ జగన్ మోహన్ రెడ్డి ఆయిల్ పామ్ సాగు, దాని ప్రయోజనాలు మరియు ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి రైతులకు వివరించారు.ఏడీఏ రణధీర్ లాభసాటి పంటల సాగు, మార్కెట్ అవకాశాలు మరియు పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించారు.

## సకల జనుల సంక్షేమానికై కొండగట్టు గిరి ప్రదక్షిణ

### చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** రైతులు, సకల జనుల సంక్షేమం కోసం, సమృద్ధి వర్షాల కురవాలని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నేడు ఉదయం 5 గంటలకు చేపట్టినట్లు చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, అట్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటున్నట్లు సత్యం వెల్లడించారు. కరీంనగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యం మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం పూర్తిగా రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని మేడిపల్లి సత్యం విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక క్షేత్రం తో పాటు పచ్చని ప్రకృతి కొండగట్టు ప్రత్యేకత అని, రాష్ట్రంలో ప్రజలు బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని నేడు గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్నట్లు సత్యం తెలిపారు. ఇది కేవలం ఒక పార్టీ కో ఒక వర్గానికో ఒక మతానికో సంబంధించిన కార్యక్రమం కాదని, ముఖ్యంగా ఎల్ నీనో ప్రభావంతో రైతుల ఇబ్బందులు తొలిగిపోవాలని సకలజనుల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భక్తులందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నానని తెలిపారు.

## కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో సిఆర్ఆర్‌టి మెషిన్ సేవలు

### కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి



**ప్రజాపక్షం /కరీంనగర్‌టౌన్ః** అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్ఆర్‌టీ) అపర సంజీవనిలా పనిచేస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో సీఆర్ఆర్‌టీ యంత్రం పనితీరు, దాని ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్నప్పుడు సీఆర్ఆర్‌టీ ఎంతో కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు. బీపీని మెయింటెన్ చేసే మందులతో 24 గంటలు డయాలసిస్ చేస్తూ ప్రాణాపాయం నుంచి కాపాడే మిషనే సీఆర్‌ఆర్‌టీ అని తెలిపారు. సాధారణ డయాలసిస్‌ను తట్టుకోలేని రోగులకు ఈ అత్యాధునిక చికిత్స విధానం నిరంతరాయంగా రక్తాన్ని శుద్ధి చేస్తూ శరీరంలోని వ్యర్థాలు, అదనపు ద్రవాలను తొలగిస్తుందని తెలిపారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై ఒత్తిడి తగ్గి కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సీఆర్ఆర్‌టీ యంత్రం పనితీరు, చికిత్స విధానం, రోగులకు కలిగే ప్రయోజనాలను వైద్యులు వివరించారు. మెడికవర్ ఆసుపత్రిలో సీఆర్ఆర్‌టీ యంత్రాన్ని సమర్థవంతంగా వినియోగించి పలువురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను టీం వర్క్‌తో కాపాడగలిగామని వైద్యులు వెల్లడించారు.

## బాలలకు ఉచిత న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/కరీంనగర్ః** బాలల హక్కుల పరిరక్షణ, భద్రతతో పాటు వారికి అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పద్మనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో, ఇంచార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె. రాణి ఆదేశాల మేరకు బాలల న్యాయ సేవల విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పిల్లలకు చట్టం కల్పించిన హక్కులు, బాలల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం–2012లోని ముఖ్యమైన నిబంధనలు, యాసిడ్ దాడుల బాధితులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణపై వివరించారు. అలాగే నల్సా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ ద్వారా ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం వంటి సేవలు అందుతున్నాయని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అర్హులైన పిల్లలు, మహిళలు, నిరుపేదలు మరియు ఇతర బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం, మధ్యవర్తిత్వ సేవలు, లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కార సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## పాదయాత్రలు కాదు పంప్ హౌస్‌లు ఆన్ చేయండి

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**ప్రజాపక్షం/గంగాధర:** చొప్పదండి నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు వెంటనే వరదకాల్వ, నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గంగాధర మండలం మదురానగర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రైతులతో కలిసి నిర్వహించిన "రైతాంగం కోసం రవిశంకర్" నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వరదకాల్వ జీవనదిలా ప్రవహించి వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని, ప్రస్తుతం చుక్క నీరు లేక దాదాపు 60 నుంచి 70 కిలోమీటర్ల పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాల్వపై ఆధారపడి సాగు చేసే రైతులు మోటార్లు నడపలేక పొలాలను పడావుగా వదిలే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధించిన కుడి, ఎడమ కాల్వల పనులను ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచాయని అన్నారు. ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన సహాయం అందిందని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను సకాలంలో అందజేయడంతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, వీణవంక జమ్మికుంట రైతుల ప్రయోజనాల కోసం పెండింగ్‌లో ఉన్న కల్వల ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసి హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు.

## కాలానికి అనుగుణంగా తీరొక్క కూరగాయల సాగు

(మొదటి పేజీ తరువాయి)

కూర సాగు చేస్తున్నారు. ఇప్పుడు బీరకాయ పంట చేతికి వచ్చింది. మిగతా భూమిలో వివిధ పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.వరికి బదులుగా కూరగాయలు వేములవాడ అర్బన్ మండలం మారుపాకలో రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ రైతు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్న విషయం తెలిసి నేరుగా ఆతడి వ్యవసాయ భూమికి వెళ్లారు. ఏ ఏ పంటలు వేస్తున్నారు? ఎంత విస్తీర్ణంలో వేశారు సాగులో మెలకువలు, సాగు విధానం తదితర అంశాలపై తిరుపతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉద్యానవన శాఖ, ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ ఏడాది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు సాగాలని పిలుపునిచ్చారు.ఈ పరిశీలనలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ వేములవాడ డివిజన్ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రూపు రేఖలు మారిన వెల్‌నెస్

(మొదటి పేజీ తరువాయి)

వైద్య పరీక్షలు చేయించుకోవడానికి తగినంత సమయం లభించేది. అయితే ఇటీవల అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని సేవలను కేవలం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు, కేవలం మూడు గంటలు మాత్రమే పరిమితం చేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బాధితులు తీరా ఇక్కడికి చేరుకునే సరికి సెంటర్ మూసివేస్తుండటంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వేలాది రూపాయాలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. అంతేకాకుండా గతంలో గుండెకు సంబంధించిన పరీక్షలు 2డి ఎకో, ఈసీజీ వంటి పరీక్షలు వెల్నెస్ సెంటర్‌లోనే నిర్వహించేవారు. అయితే ఇప్పుడు గుండె సంబంధిత రోగులకు ఈ సేవలు అందడంల ఏదని వాపోతున్నారు.

ప్రభుత్వ సేవలు పొందే హక్కు ఉన్న ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్ల ఆరోగ్యంతో చెలగాటమాడటం తగదని బాధితులు పేర్కొంటున్నారు. వెల్నెస్ సెంటర్ పని వేళలను తక్షణమే పాత పద్ధతిలోనే ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పునరుద్ధరించాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల మందులను సెంటర్‌లోనే నిరంతరంగా లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మల్లారెడ్డిపల్లిలోలో సిసి కెమెరాలు ప్రారంభించిన ఎసిపి

**ప్రజాపక్షం/వీణవంక:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పడతాయని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు.వీణవంక మండలంలోని మల్లారెడ్డి పల్లి గ్రామంలో గ్రామస్థుల సహకారంతో సుమారు ఒక లక్ష 70 వేల రూపాయలతో 8 సీసీ కెమెరాలు స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజూరాబాద్ ఏసీపీ మాధవి,జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్,మల్లారెడ్డి పల్లె సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ తో కలిసి మంగళవారం సీసీ కెమెరాలు ప్రారంభించారు.పోలీసు అధికారులను,దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్‌లో గోరింటాకు పండుగ వేడుకలు

**ప్రజాపక్షం/కరీంగనర్ టౌన్ః** ఆషాడం మాసం అంటేనే మహిళలకు గుర్తుకొచ్చేది గోరింటాకు పండుగ అని 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అర్ష కిరణ్మయి అన్నారు. మంగళవారం ఆదర్శనగర్‌లోని తన నివాసంలో గోరింటాకు పండుగను కాలనీకి చెందిన పలువురు మహిళలతోకలసి ఘనంగా నిర్వహించుకున్నారు. సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ గోరింటాకు పండుగను మహిళలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవడం శుభ పరిణామం అని అన్నారు.. వర్షాకాలంలో తొలకరి జల్లులు కురిసే సమయాన పిల్లలు మహిళలు పెద్ద ఎత్తున గోరింటాకు పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అని.. ఈ గోరింటాకు పండుగను భవిష్యత్తు తరాలు కూడా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాలనీకి చెందిన మహిళలు రాధా, సత్తమ్మ, శారద, రాధిక, సుభద్ర, సబిత పాల్గొన్నారు.

## అక్రమార్కులకు అండగా స్థానిక ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** అక్రమార్కులను కాపాడమే పనిగా పెద్దపల్లి ఎమ్మెల్యే వ్యవహారం తీరు కొనసాగుతుందని బిజెపి సీనియర్ నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి విమర్శించారు.మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్సార్ గార్డెన్స్ లో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో హెచ్&టీ గోదాముల ద్వారా కేవలం ఒకే సంవత్సరంలో కరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లలో సుమారు రూ.700 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై ఈడీ,విజిలెన్స్, కేంద్ర ప్రభుత్వం మరియు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి భారతీయ జనతా పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్, కాసాగోని నిర్మల, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు రఫీక్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అరుణ్ రంజా,శాలిగంటి కొమురయ్య,దాసరి చందు, వీరగోని కిరణ్, కొత్తూరు సంపత్,సుబ్బని సురేష్,రమేష్ గౌడ్,శేఖర్ మాస్టర్, ఈర్ల ప్రశాంత్, ఈనెంకా వేంకటేష్,కరెంగుల హరీష్, పాల్గొన్నారు.

## చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనిసుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.దాడిలో పూసల గ్రామానికి చెందిననిమ్మల అనిల్,చొప్పరి రాకేష్,చొప్పరి రాజు,కొమ్ము శ్రీకాంత్,పూసల సాంబ మూర్తి,అనే ఐదుగురు వ్యక్తులు మూడు ముక్కలాట ఆడుతూ నగదుతో జూదం నిర్వహిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి రూ.25, 020/ నగదు, 52 పేకముక్కలు,5 మొబైల్ ఫోన్లు,3 మోటార్ సైకిళ్లను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఇలాంటి ఘటనలకు ఎవరైనా పాల్పడినట్లయితే పోలీసువారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## రోడ్లు జలమయం.. పాదాచారుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో తేలికపాటి వర్షాలకే రోడ్లు జలమయం అవుతుండడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చిన్న వర్షాలకే రోడ్డు పై నీరు వరదల ప్రవహిస్తుంది. ఇప్పటికైన ఆర్అండ్బి అధికారులు చోరవతీసుకుని రోడ్డుపై పారే వరద నీరును డ్రైనేజీలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోం అని ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఊడుగుల యాదగిరి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజన్నపేట గ్రామంలో నిర్మించనున్న గోదాం కు భూమి పూజ చేసే కార్యక్రమానికి హాజరైన కేకే మహేందర్రెడ్డి కేంద్ర ప్రభుత్వం పై పలు విమర్శలు చేశారు.

# పోక్సో నేరాలపై ఉక్కుపాదం

### సిరిసిల్ల జిల్లా ఎస్పి మహేష్ గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలికపై లైంగిక వేధింపుల (పోక్సో) కేసులో నిందితుడుకి 20 సంవత్సరాలు జైలు శిక్ష, 2000/– రూ. జరిమానా విధిస్తు సిరిసిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సిరిసిల్ల కి చెందిన బూర్ల చంద్ర శేఖర్ అనే వ్యక్తి సిరిసిల్ల కి చెందిన ఒక మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేయగా, బాలిక యొక్క తల్లి పిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీ కాంత్ వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువైందన్నారు. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ఈకేసులో పకడ్బంధిగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన అప్పటి విచారణ అధికారి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి , ప్రస్తుత డిఎస్పీ నాగేంద్ర చారి,ప్రస్తుత సి.ఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీ కాంత్,కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు,శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు.



# నేరెళ్ల బాధితుల పక్షాన ఉండి పోరాడుతాం

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నేరెళ్ల బాధితులను పరామర్శించి పోవడానికి రాలేదని వారి పక్షాన ఉండి పోరాడుతామని టిఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. నేరేళ్లలో మంగళవారం బాధితులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. నేను బాధితులను పరామర్శించి పోవడానికి రాలేదని అందరిని ప్రశ్నిస్తామని శిక్ష పడే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడు ఓట్ల కోసం వీరిని వాడుకున్నారని ఎందరో మంత్రులు వచ్చి పరామర్శించారని వీరి సమస్య ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఇవన్నీ మరిచిపోతారా? అని నిలదీశారు. నేరెళ్ల బాధితులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను రక్షించడానికే రక్షణ సేన అని పార్టీ పేరు పెట్టామన్నారు. ఢిల్లీ నుండి రిపోర్ట్ తెప్పించి ముఖ్యమంత్రి మెడలు వంచి ప్రశ్నిస్తామన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఈ సంఘటన జరిగితే రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చి 30 నెలలు గడుస్తున్న గడిచిన 30 నెలలలో కనీసం నేరెళ్ల పేరు కూడా ఎత్తలేదని మండిపడ్డారు. ఆవేదనతో బాధితులు రాస్తారోకో చేస్తే పోలీసులు 8 మందిని ఐదు రోజులు వారు ఎక్కడున్నారో చెప్పకుండా ఇష్టం వచ్చినట్టు కొట్టి కనీసం జైలర్ కూడా తీసుకోకుండా చేసిన పోలీసులకు ఒకరికి కూడా శిక్ష పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ప్రభుత్వం దమన కాండ సృష్టించినా ఎవరికైనా శిక్ష పడిందా అని ప్రశ్నించారు.



# పాదం, మడమ నొప్పులకు యశోదలో ఆధునిక చికిత్సలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** పాదం, మడమ నొప్పులను సామాన్యమైనవిగా భావించి నిర్లక్ష్యం చేయవద్దని యశోద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ డి.బి. ఆదిత్య సోమయాజి సూచించారు. మంగళవారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాదం, మడమ చికిత్సల్లో వచ్చిన ఆధునిక మార్పులు, సాంకేతిక పురోగతిపై ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదం, మడమ సమస్యలు చాలా సాధారణమైనప్పటికీ, అత్యధికులు నొప్పి తీవ్రమయ్యే వరకు ఉపేక్షిస్తుంటారని తెలిపారు. మడమ నొప్పి, తరచుగా బెణకడం, పాదం ఆకృతి మారడం, క్రీడా గాయాలు, మధుమేహం వల్ల వచ్చే సమస్యలను కేవలం వయోభారం వల్ల వచ్చినవిగా భావించవద్దని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే పెద్ద సమస్యలతో పాటు శాశ్వత వైకల్యాన్ని కూడా నివారించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఆధునిక స్కానింగ్ పద్ధతులు అందుబాటులోకి రావడంతో సమస్యలను కచ్చితంగా గుర్తించి, ప్రతి రోగికి తగిన చికిత్స అందించే అవకాశం ఏర్పడిందన్నారు. చిన్న కోతలతో (మినిమల్లి ఇన్వేసివ్) చేసే శస్త్రచికిత్సల వల్ల నొప్పి తక్కువగా ఉండి, బాధితులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. అత్యాధునిక ఇంప్లాంట్లు, 3డీ ప్రింటింగ్ సాంకేతికత సహాయంతో సంక్లిష్ట ఎముక విరుగుళ్లు, పాద వికృతులు, ఎముక లోపాలను సమర్థవంతంగా సరిదిద్దవచ్చని వెల్లడించారు. బాధితుల అవసరాన్ని బట్టి కీళ్లను కాపాడే శస్త్రచికిత్సలు, యాంకిల్ జాయింట్ మార్పిడి ద్వారా నడకను సాధారణ స్థితికి తీసుకురావచ్చని వివరించారు.ఆధునిక ఫిజియోథెరపీ, పునరావాస చికిత్సల ద్వారా రోగులు త్వరగా తమ రోజువారీ పనులు, ఉద్యోగాలు, క్రీడల్లో తిరిగి పాల్గొనవచ్చని తెలిపారు. మధుమేహ బాధితులు క్రమం తప్పకుండా పాదాలను పరిశీలించుకోవాలని, సరైన చెప్పులు ధరించాలని సూచించారు.పాదాలే చురుకైన జీవితానికి బలమైన పునాది అని, నొప్పిని ఏమాత్రం అలక్ష్యం చేయకుండా సంప్రదించాలని కోరారు.

## బాధితుడిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన బత్తుల మల్లేష్ అనే వ్యక్తి వరంగల్లోని ఎంజీఎం ఆసుపత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శ్రీను బాబుల ప్రత్యేక సహకారంతో ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.ఈ నేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెల్కల జితేందర్ యాదవ్ ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి బాధితుడు మల్లేష్ను పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని భరోసా ఇచ్చారు.

## ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/ముత్తారం :** మండల పరిధిలోని మైదమ్మంద రైతు వేదికలో మంగళవారం 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో పరిస్థితులు,లోటు వర్షపాతం దృష్ట్యా ఆరుతడి పంటల ప్రాముఖ్యతను వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి లాంటి అధిక నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆసక్తి గల రైతుల కోసం జిల్లాలో కంది,పెసర, నువ్వులు, మినుములు,ఆముదం వంటి విత్తనాలు సిద్ధంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

## నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

**ప్రజాపక్షం/రామగిరి :** నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్య నారాయణ అన్నారు. మంగళ వారం సింగరేణి రామగుండం3 ఏరియా, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో పర్యటించారు. వారికి జి.యం కార్యాలయం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు స్వాగతం పలికారు.నిర్దేశించిన ఓ.బి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, ఉపరితల గనులలో వర్ష కాలం తీసుకోవలసిన జాగ్రత్తలను తూచ తప్పక పాటించాలని, అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ సాల్వేజింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్వోటుజియం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురామ్ లతో పాటు,ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి, చిన్నపిల్లల వైద్య సేవలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఐ టి మినిష్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్లో ఇటీవల నిర్వహించిన వైద్యుల నియామకాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని ప్రభుత్వ ఆసుపత్రికు ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు డా. మామిడిపల్లి స్రవంతి గైనకాలజిస్ట్గా, డా. గుంట మౌనిక అనస్తీషియా స్పెషలిస్ట్గా, డా.నరేష్ పీడియాట్రిషన్గా నియమితులయ్యారని పెద్దపల్లి జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ తెలిపారు.మంథని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన, ఉచిత వైద్య సేవలను పొందాలని డా. కె. శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు.

## బ్యాంకు ముందు నీరు నిల్వ.. ఖాతాదారులకు అవస్థలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని విద్యానగర్ లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు ముందు వర్షం నీరు ఎటు వెళ్ళక నిలిచి ఉండడం వల్ల ఖాతా దారులు తమ అవసరాల కోసం బ్యాంకు లోకి వెళ్ళేందుకు అనేక అవస్థలు పడుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ పేర్కొన్నారు.సంబంధిత బ్యాంకు అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కలిసి నిల్వ నీటిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ లక్ష్మీపతి,సుదర్శన్,బూడిద మల్లేష్,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆసాల నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ సాధన కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి,ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ,జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులను ఆదుకుంటామని, జార్ఖండ్ రాష్ట్రం మాదిరిగా పింఛన్లు,ఇళ్లు, 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని సోనియా గాంధీ,రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీలు ఇచ్చారని వారు గుర్తుచేశారు.ఆ మేనిఫెస్టో హామీలను నమ్మే తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండన్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కేకే అధ్యక్షతన శోభన్ రెడ్డి,రాములు నాయక్,పొన్నం ప్రభాకర్,అద్దంకి దయాకర్ తదితరులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమే అయినప్పటికీ,ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని కోరారు.ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు పూట గడవని దుస్థితిలో ఉన్నారని,రాబోయే పండుగల నాటికి ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు అందజేసి,ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలోతెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ ఖతీజా,ఆలేటి ఎల్లమ్మ,గద్దం లక్ష్మి. మొలుగూరి నర్సయ్య,పెర్క రాయమల్లు,ఈదునూరి శంకర్,బోసేలి శాంత,తదితరులు పాల్గొన్నారు.

## భూముల వివరాలు అందించాలని వినతి

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ, పోరంబోకు, ఇతర ప్రభుత్వ స్థలాల వివరాలు అందించాలని కోరుతూ బిజెపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ గౌతమికి మంగళవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన గ్రామ సభలలో ఈ సమస్యను సర్పంచ్,కార్యదర్శికి స్వయంగా వివరించినప్పటికి ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామ ఆస్తుల రక్షణ,పారదర్శకతను పెంపొందించే ఉద్దేశంతో రాతపూర్వకంగా వినతి పత్రం అందజేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉన్నారు.

## యువకులు రక్తదానం

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన యువకులు మంగళవారం స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.కరీంనగర్‌లో అత్యవసర పరిస్థితుల్లో భూపతిపూర్ గ్రామానికి చెందిన నక్క గంగారంకు రక్తం అవసరమని తెలుసుకుని అదే గ్రామానికి చెందిన జంగేటి శ్రీకాంత్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. అలాగే జగిత్యాలలో కొత్తపేట గ్రామానికి చెందిన రాజయ్యకు అత్యవసరంగా రక్తం అవసరమవడంతో భూపతిపూర్ గ్రామానికి చెందిన తీగల రాజేందర్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు.అత్యవసర సమయంలో ఆలస్యం చేయకుండా ముందుకు వచ్చి ఇద్దరు బాధితులకు అండగా నిలిచిన యువకుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

## బాలసభ కార్యక్రమం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మంగళవారం జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో బాలసభ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్, పంచాయతీ కార్యదర్శి హామేదా, ఉప సర్పంచ్ అగునూరి గంగారాజం, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి సూపర్వైజర్ లావణ్య, ఎఎన్ఎం శిరీష, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు,ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, గ్రామ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రగతిపై నేడు ప్రత్యేక సమీక్ష

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండల, గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపీడీవో ప్రేమ్ సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, స్థానిక సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు.మండల అభివృద్ధి లక్ష్యాలను సాధించడమే ప్రధాన ఉద్దేశంగా సమావేశం కొనసాగనుందని ఎంపీడీవో తెలిపారు.

# ఉద్యాన పంటలతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** వర్షాభావ పరిస్థితులలో మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ఉద్యాన,ఆయిల్ ఫామ్, కూరగాయలు, పండ్లు సాగుచేయాలని తద్వారా అధిక దిగుబడితో లాభాలు పొందవచ్చని జగిత్యాల జిల్లా ఉద్యాన అధికారి కట్ట లత పేర్కొన్నారు. ధర్మపురి మండలం నర్సయ్య పల్లె రైతువేదిక లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ఉద్యాన పంటల సాగు,ఎల్ నినోప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక,ఆయిల్ ఫామ్,కూరగాయలు, డ్రిప్ పరికరాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉద్యాన అధికారి లత మాట్లాడుతూ తక్కువ నీటితో సాగుకు అనుకూలంగా ఉండే ఉద్యాన పంటలు కూరగాయలు, పండ్లు, పూల సాగుపై వివరించారు.పంట మార్పిడిలో భాగంగా వరి సాగు చేసే గ్రామాల్లో ప్రధానంగా ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలన్నారు.కార్యక్రమానికి ముందు ధమ్మన్నపేట గ్రామంలో కటకం రాజన్న సాగు చేస్తున్న కూరగాయల తోటలు,పందిరి కూరగాయల సాగును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన వన అధికారి అర్చన,మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్,ఏఈఓ నవ్య,అజయ్,ఉద్యాన విస్తరణ అధికారి వంశీకృష్ణ,ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.



# తుంగూరులో ఘనంగా మహిళా సభ

**ప్రజాపక్షం/బీరుపూర్ :** జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం లోని తుంగూరు గ్రామంలో మంగళవారం ఆర్.ఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన మహిళా సభ అత్యంత ఘనంగా జరిగింది. గ్రామంలోని మహిళల్లో చైతన్యం నింపేలా, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ వేదిక ఒక గొప్ప ఉదారతకు సాక్ష్యంగా నిలిచింది. పిల్లల విజ్ఞానం కోసం భూ కేటాయింపు – రాజ గుణం చాటుకున్న సర్పంచ్ఈ సభ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు మహిళా మూర్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలు, చదువుకున్న యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా గ్రామానికి మంచి పౌరులుగా ఎదగాలంటే విజ్ఞాన గని అయిన గ్రంథాలయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గతంలో గ్రామపంచాయతీ భవనానికి సొంత భూమిని దానం చేసిన ఆయన, ఇప్పుడు అదే స్థలం ప్రక్కనే నూతన గ్రంథాలయ నిర్మాణం కోసం ఉచితంగా భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.సర్పంచ్ చేసిన ఈ విరాళం పట్ల గ్రామంలోని మహిళలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో , ఉప సర్పంచ్ శీలం లింగన్న, సి డి పిఒ వాణిశ్రీ, ఎస్సై రాజు, సఖి కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి , శ్రీనిధి ఎఎం రమాదేవి, ఎపిఎం ప్రమీల, ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ, ఏఎన్ ఎం జ్యోతి, యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ బాపు, మేనేజర్ రవి,ఐకేపీ సి సి గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ దోసరపు బుచ్చన్న,వార్డు సభ్యులు రవిచంద్ర అనూష, శ్రీనివాస్ లాస్య, మహేష్ మమత, గంగవ్వ, లక్ష్మి , శ్రీనివాస్, తిరుపతి, రాజశేఖర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ రక్షణ, భావితరాల భవిష్యత్తే ప్రధాని లక్ష్యం

### డా. అనూప్ రావు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్‌లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు నివాసంలో ఏర్పాటు చేసిన బీఎల్ఏ–2 కార్యకర్తల సమావేశంలో డాక్టర్ అనూప్ రావు మాట్లాడుతూ, సామాన్య కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. సాధారణ కార్యకర్తలను ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా తీర్చిదిద్దిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. దేశ రక్షణతో పాటు భావితరాల భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, కోయల్ కార్ లింగేశ్వర్, పుదుకారం కిషోర్ రెడ్డి, బొడ్ల నాగేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి జుంగుల అనిల్ గౌడ్, బత్తుల జగదీష్, కలికోట శ్రీకాంత్, పట్టణ ఉపాధ్యక్షుడు కొయ్యల లక్ష్మణ్, లోలప్ అనిల్, ఐటీ సెల్ కన్వీనర్ పొన్నంటి శ్రీనివాస్, తల్లోజి భాస్కర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొడ్డ అనిల్, గుంటుక హనుమాన్లు, గుంటుక సదాశివ్, దండిగ నరసయ్య, బొమ్మన రామస్వామి,సంబోజి వివేక్,భీమ్నాథ్ విజయ్‌తో పాటు బిజెపి, బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ఎమ్మెల్యే సంజయ్ ప్రతిపాదనలు

### ఆరోగ్య శాఖ మంత్రికి 19 వినతులు సమర్పణ

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు సంబంధించిన 19 కీలక వినతులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా చర్చించారు.నియోజకవర్గంలోని కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి సహా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యులను బదిలీ చేయకుండా కొనసాగించాలని, ఖాళీగా ఉన్న వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్, సాంకేతిక, పరిపాలనా సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.మంత్రి దామోదర రాజనర్సింహ కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్,రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జగిత్యాల జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ముదిరిన ఫ్లెక్సీ వివాదం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రేగుంట గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ల మధ్య నెలకొన్న ఫ్లెక్సీ వివాదం తారాస్థాయికి చేరింది. గ్రామంలో ఫ్లెక్సీలు వాల్ రేటింగ్ ఇతర ప్రకటనల కొరకు గ్రామపంచాయతీ అనుమతి తీసుకొని నిర్ణీత చార్జీలు చెల్లించి ఏర్పాటు చేసుకోవాలని గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. గ్రామంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు,వాల్ రేటింగులు మూడు రోజులపాటు ఉచితమని, తదనంతరం చార్జీలు చెల్లించాలని తీర్మానం చేసినప్పటికీ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కొన్ని నెలల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఫీజు చెల్లించని లేదని సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ, సిబ్బందితో కలిసి ఫ్లెక్సీలను తొలగించేందుకు సిద్ధమవగా ఉప సర్పంచ్ అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. కొద్దిసేపు ఉద్రిక్తంగా మారినప్పటికీ సర్పంచ్ ఫ్లెక్సీలను తొలగించడం కోసం మొరపు. ఒకే పార్టీకి చెందిన సర్పంచ్ ఉప సర్పంచ్ మధ్య ఫ్లెక్సీ వివాదం తెరమీదకు రావడంతో వివాదాలకు దారి తీయకుండా గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.



## సామాజిక సేవలో వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** గ్రామంలో వ్యక్తిగత పరిశుభ్రత లోపించి నిరుపయోగంగా పడి ఉన్న మరుగుదొడ్లను స్వచ్ఛందంగా శుభ్రం చేసినట్లు సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్డి , ఇటు ప్రయాణికులకు ప్రతి సోమవారం వారసంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సొంతంగా శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి.గ్రామంలో నిర్వహించే ప్రతి స్వచ్ఛంద కార్యక్రమంలో ముందుంటుంది వెంకటరెడ్డి గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.కాగా పలువురు గ్రామస్తులు ప్రయాణికులు,వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గంగనాలకు నీరు విడుదల చేయాలి

### బిజెపి మండల అధ్యక్షుడు బాయిలింగారెడ్డి

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** సదర్మాట్ ప్రాజెక్టు నుంచి గంగనాల ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, పంతంగి వెంకటేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గడ్డం సంజీవ్ రెడ్డి, కొట్టాల సురేష్,బీజేవైఎం మండల అధ్యక్షుడు బోడ నవీన్ రెడ్డి,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సురేష్ తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీర్పూర్ మండలంలోని ఫెర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

**ప్రజా పక్షం/బీర్పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని తుంగూర్, కండ్లపెల్లి గ్రామాల ఫెర్టిలైజర్ షాపులలో మండల వ్యవసాయ అధికారి తిరుపతి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.బిల్లు లు లేని విత్తనాలు,రసాయనాలు,ఎరువులు అమ్మవద్దని.అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లైసెన్స్ లు క్యాన్సిల్ చేయడం, స్టాప్ సేల్స్ ఇవ్వడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం షాపులలో స్టాక్ రికార్డ్‌లు తనిఖీ చేసి ఎవరైనా అధిక ధరలతో ఎరువులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లపై వ్యాపారాలకు అడ్డుకట్ట

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై వీధి వ్యాపారులు వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ సోమవారం ఆకస్మికంగా మార్కెట్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా రహదారిపై వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులను వెనుకకు జరిపించి,క్రమబద్ధంగా వ్యాపారం నిర్వహించేలా చర్యలు చేపట్టారు. దుకాణ యజమానులు రహదారులపై ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలకు,వీధి వ్యాపారులకు ఇబ్బందులు కలిగిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అలాగే తోపుడు బండ్లపై రహదారులను ఆక్రమించి వ్యాపారం చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్,ముజీబ్,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఒలకు సన్మానం

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లక్ష్మి దేవి పల్లి, ధర్మనాయక్ తాండ గ్రామాలలో 100శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన సందర్భంగా బిఎల్‌వోలు స్వప్న, శ్యామల, ఆది లక్ష్మి లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు జగిత్యాల మాజీ జెడ్పి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తెలిపారు. బిఎల్‌వోలు ఒక పక్క అంగన్వాడీ బాధ్యతలు, ఎస్ఐఆర్ ప్రక్రియను బరువుగా కాకుండా బాధ్యతతో పని చేసి 100శాతం పూర్తి చేసినందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు సాంబారి గంగాధర్, ఉపేందర్ వోద్నాల జగన్, మహిపాల్, జలంధర్, ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి, సుమన్, మహేష్, రమేష్, సతీష్, గంగాధర్ నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా గోలి రాము



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండల లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా గోలి రాము ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో గోలి రాముకు శాలువా కప్పి సత్కరించడంతో పాటు గంగాదేవి పుస్తకాన్ని బహూకరించారు. సమాజ సేవలో ముందుండే గోలి రాము ప్రధాన కార్యదర్శిగా క్లబ్ అభివృద్ధికి కృషి చేసి మరింత గుర్తింపు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కోడి సృజన్, సంద వేణి పవన్ యాదవ్, కొండపల్లి మహేష్, జనసేన మండల అధ్యక్షుడు మూగల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి, సరుగుడు మొక్కల పంపిణీ



ప్రజాపక్షం / కౌటాల: కౌటాల మండలం తలోడి గ్రామంలో ఐఎఫ్ఎస్ రైతులకు దసరి, బంగినపల్లి మామిడి మొక్కలతో పాటు సరుగుడు మొక్కలను పంపిణీ చేశారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ (విసిఎఫ్) ఆధ్వర్యంలోని సిఆర్ఎఎల్‌విటి కార్యక్రమంలో భాగంగా ఈ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల నాటడం, సంరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సహాయం అందించినందుకు విసిఎఫ్ ఫౌండేషన్ ప్రతినిధులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసోసియేట్ గోండ్ గజానంద్, సిఆర్పి కుసుమ, సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ ఎల్లు రవీందర్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## వాహనాల వేలం

ఎక్సైజ్ సిఐ వి. రవి

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ వి. రవి తెలిపారు. ఈ నెల 30వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.లక్ష్మి నాయక్ సమక్షంలో ఈ వేలం జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం ద్వారా అమ్మకానికి ఉంచుతున్నామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేలంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాల కోసం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

## జగన్నాథుని రథయాత్రలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్: జగన్నాథ రథయాత్రకు మన భారతదేశంలో ప్రత్యేకత ఉందని, గొప్ప చరిత్ర కలదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వేడుకగా నిర్వహించిన జగన్నాథుని రథ యాత్ర మరియు పండరిపుర యాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్నాథుని రథయాత్ర భారతదేశంలోని అత్యంత ప్రాచీన వైభవమయమైన హిందూ పండుగలో ఒకటి అని, ఈ మహోత్సవం ప్రతీ సంవత్సరం ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలోని జగన్నాథుని ఆలయంలో ఘనంగా నిర్వహించబడుతుందని, శ్రీ జగన్నాథుడు, జలభద్రుడు, సుభద్ర దేవి ఉత్సవ విగ్రహాలను అద్భుతమైన రథాలలో ఊరేగిస్తానని తెలుపుతూ ఈ యాత్ర ద్వితీయ రోజున ప్రారంభమవుతుందని తెలిపారు. అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తారని, ఈ యాత్రలో పాల్గొనడం వల్ల దైవ అనుగ్రహం, పుణ్యఫలం లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జగన్నాథుడు తన భక్తుల వద్దకు స్వయంగా వచ్చి ఆశీర్వదిస్తున్న సంకేతంగా ఈ రథయాత్రను భావిస్తారని చెప్పారు ఈ ఉత్సవం సమానత్వం, భక్తి, సేవా భావం మరియు ఐక్యతకు గొప్ప సూచిక అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేసినటువంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆలోచింప చేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్ఐ శ్రీకాంత్

ప్రజాపక్షం / కెరమెరి : కెరమెరి ఘాట్ రోడ్డులోని ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నితికా పంత్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ డిఎస్‌పి, వాంకిడి సిఐ సూచనలతో కెరమెరి ఎస్ఐ శ్రీకాంత్ ఘాట్ రోడ్డును పరిశీలించారు. రహదారి పక్కన అధికంగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు వాహనదారుల దృష్టికి ఆటంకం కలిగిస్తున్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు వేగ పరిమితిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత పిలుపునిచ్చారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని కీమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మందికి కంటి పరీక్షలు చేయగా, 17 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఎంపిక చేసిన వారికి సొసైటీ సొంత ఖర్చులతో రవాణా, భోజన వసతి కల్పించి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తామని వ్యవస్థాపకులు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇంచార్జ్ గోపి, కీమ్స్ హాస్పిటల్ సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అండర్‌పాస్ నిర్మాణం కోసం పాదయాత్ర

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొయిరె ప్రకాష్

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండలం బంబార గ్రామం వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్, బస్ షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన 18 కిలోమీటర్ల పాదయాత్ర విజయవంతమైంది. పాదయాత్రకు సహకరించిన ప్రజలు, నాయకులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొయిరె ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. బంబార గ్రామం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బొయిరె ప్రకాష్ మాట్లాడుతూ అండర్‌పాస్ లేకపోవడం వల్ల బంబార వద్ద ఇప్పటివరకు 20 రోడ్డు ప్రమాదాలు జరిగి పది మంది మృతి చెందారని, పలువురు గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అండర్‌పాస్, బస్ షెల్టర్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంబార సర్పంచ్ కృష్ణాజీ, ఉపసర్పంచ్ సంతోష్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అడ్డా కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్



ప్రజాపక్షం / శ్రీరాంపూర్: మంచిర్యాల పట్టణంలోని అడ్డా కార్మికులకు ప్రత్యేక స్థలంతో పాటు షెడ్లు, కనీస మౌలిక వసతులు కల్పించాలని హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకు వినతిపత్రం అందజేశారు. ఓవర్‌బ్రిడ్జి, ముఖ్రం చౌరస్తాల వద్ద కూలీలు రోడ్లపై నిలబడి ఎండ, వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్థలాన్ని కేటాయించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు పత్తిపాటి సాయికృష్ణ, ఎండి షఫీ, ఎండి హుస్సేన్, అగ్గు మహేష్, పల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ గుంతతో పొంచి ఉన్న ప్రమాదం



ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాల ప్రాంగణంలో కేబుల్ లైన్ కోసం తవ్విన గుంతను నెలలుగా పూడ్చకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాంకిడి పశువైద్యశాలకు ప్రతి రోజూ చికిత్స కోసం పాడి పశువులను తీసుకువచ్చే రైతులకు గుంత కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నా యి. గుంత వల్ల పశువులను అదుపు చేయడం, చికిత్స అందించడం వైద్య సిబ్బందికి కష్టంగా మారింది. బయటకు కనిపిస్తున్న కేబుల్‌పై పులను చూసి పశువులు భయాందోళనకు గురవుతున్నాయని, ప్రమాదవశాత్తు గుంతలో పడితే తీవ్ర గాయాలయ్యే ముప్పు ఉందని వైద్య అధికారులు పేర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో నీరు నిలిచి దోమలు, పురుగులు వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, కేబుల్ సంస్థ, గ్రామపంచాయతీ అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టేసుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను వెంటనే పూడ్చివేయాలని వైద్య సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

## రహదారి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండలం సరండి గ్రామంలో ప్రధాన రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గ్రామస్తులు శ్రమదానంతో తొలగించారు. సరండి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపైకి సుబాబుల్, తుమ్మ చెట్ల కొమ్మలు అడ్డుగా వాలడంతో పాఠశాల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాభివృద్ధి, ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, గ్రామ పటేల్ కొట్రాంగే మేంఘజి ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువకులు స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టారు. రహదారికి అడ్డుగా ఉన్న కొమ్మలను కొద్ది గంటల్లోనే తొలగించి మార్గాన్ని సుగమం చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ రహదారులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్య.. క్రీడా సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్ మండలంలోని పవర్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తొడసం రాజేందర్ విద్యాసామాగ్రితో పాటు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. గతంలో నిర్వహించిన బాలల గ్రామసభలో ఇచ్చిన హామీ మేరకు ఆయన ఈ పంపిణీ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్ బాక్సులు, వాలీబాల్, క్రికెట్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి తగిన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఆత్రం తిరుమలేశ్వర్, ఉపాధ్యాయులు జాయ్ లలిత, మంగరాణి, గ్రామ పెద్దలు అనకార్ అంజి పటేల్, సుదర్శన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/బోథ్ :** బోత్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశం సందర్భంగా ఎంపీడీవో ఎల్. రమేష్ మాట్లాడుతూ జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ వారిగా ఫారంపాండులు,ఇంకుడు గుంతలు , బోర్వెల్, రీఛార్జ్ ,నిర్మాణాలు చేపట్టుటకు మహిళా సంఘాలకు రైతులకు అవగాహన కలిపించాలి అన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి చేనుకు ఫారంపాండు నిర్మించు కునేలా ప్రోత్సహించాలని సూచించడం జరిగింది. ఇట్టి లక్ష్యాలను ఆగస్టు 15లోగా పూర్తి కావాలి అని తెలిపారు.ఈ సమావేశంలో ఏపిఎం గణేష్,ఈసి మధుకర్,టిఏలు,ఐకెపి సీసీలు పాల్గొన్నారు.

## పపంచ పులుల దినోత్సవం

**-ప్రజాపక్షం/సారంగాపూర్ :** ప్రపంచ పులుల దినోత్సవాన్ని (జూలై 29) పురస్కరించుకుని సారంగాపూర్ మండలంలోని జామ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖన పోటీలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సారంగాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ నజీర్ ఖాన్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మరియు పులుల ప్రాధాన్యతపై విశేష అవగాహన కల్పిస్తాయని తెలిపారు.భవిష్యత్ తరాలు ప్రకృతి, అడవులు మరియు జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,అటవీ శాఖ బీట్ అధికారులు వెన్నెల,సుజాతలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ధూంధాం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల బోనాల జాతర ఘనంగా నిర్వహించామని జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ధూంధాం జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బోనాల జాతర కార్యక్రమాన్ని ఐక్యత కోసమే జరిపామన్నారు. మంగళవారం మాక్లూర్ మండలంలోని డ్యాట్‌పల్లిలో ఒడ్డెటవ్వ వద్ద బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి కళాకారులు పూలమాలలు వేశారు. కమాన్ నుంచి డప్పు దరువులతో శివసత్తుల, పోతరాజు, నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన అర్హులైన అన్ని విభాగాల్లోని కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కళాకారులకు ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం మొదటి సారి నిజామాబాద్ నిర్వహించటం గొప్ప విషయమన్నారు. ఈ బోనాల కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగా, గోదావరి, సాయి లోవోల, సవిత, రాజేందర్, సలహాదారులు పస్క నర్సయ్య, పాశంకుమార్, బొడ్డెన్న యాదవ్, నాగరాజు, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతికుమార్, రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేందర్, ప్రశాంత్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, సభ్యులు చిట్టిబాబు, మాదాసు గోపి, నర్సయ్య, చిన్నరాజేందర్, రవినాయక్, సంతోష్, మనోజ, దివ్య, మానస, స్రవంతి, సమత, లత, శ్వేత, జిల్లా ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ప్రాంగణ హాస్టల్లో వసతి కల్పించాలి



**ప్రజాపక్షం/నస్పూర్ :** మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బిసి, ఎస్టి బాలికలకు కళాశాల ప్రాంగణంలోని ఎస్సి హాస్టల్లో వసతి కల్పించాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ జిల్లా కలెక్టర్ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న సుమారు 20 మంది బిసి, 10 మంది ఎస్‌టి విద్యార్థినులకు బిసి హాస్టల్ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రతిరోజూ రాకపోకలు భారంగా మారాయని తెలిపారు. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి దాటి రావాల్సి రావడంతో భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. హాస్టల్ దూరం కావడం వల్ల కొందరు అడ్మిషన్లు రద్దు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలోని ఎస్సి హాస్టల్లో ఖాళీ సీట్లు ఉంటే వారికి వసతి కల్పించడం వల్ల సమయానికి తరగతులకు, లైబ్రరీకి హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థినుల భద్రత, ఉన్నత విద్యను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# లయన్స్ క్లబ్ 20వ ప్రమాణ స్వీకార కార్యక్రమం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని పి.ఆర్.టి.యు భవన్‌లో మంగళవారం సాయంత్రం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ 2026–27 సంవత్సరానికి సంబంధించిన 20వ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.క్లబ్ అధ్యక్షుడు కె. సన్నిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బసవేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రపంచంలో అనేక సేవా కార్యక్రమాలను లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నామని తెలిపారు.సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తే భగవంతుడు కుటుంబానికి ఎనలేని మేలు చేస్తాడని పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి వివరించారు.ఈ సందర్భంగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వి. లక్ష్మి 2026–27 నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా క్లబ్‌లో చేరిన కిషన్, డాక్టర్ సాయికేతన్ రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సుదర్శన్,బెజ్జారపు రాజేశ్వర్‌లకు పిన్‌లు అమర్చి,ఇండక్షన్ ఆఫీసర్ పి. సుధీర్ బాబు క్లబ్‌లోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా రవాణా అధికారి అజ్మీర శ్యామ్ నాయక్, లోక్ జాగరణ్ దినపత్రిక సంపాదకులు అల్వాల హన్మంతు, రీజియన్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, జిల్లా జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ ఎం. రాజన్న, జోన్ చైర్మన్ చంద్ర మోహన్ రెడ్డి, రీజియన్ సెక్రటరీ చాకు లింగం, ఏరియా కోఆర్డినేటర్ కె. గంగారెడ్డి, క్లబ్ కార్యదర్శి రాఘమల్ల రాజశేఖర్, కోశాధికారి పి. రాంచందర్, ప్రోగ్రామ్ చైర్మన్ కారింగుల వెంకటేశ్వర్లు, కోచైర్మన్ ఏ. సంజీవరావు,మాస్టర్ ఆఫ్ సెరమనీ పాలెపి సుదర్శన్,కొండాడి శ్రీనివాస్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు

**ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి సన్ని గౌడ్ డిమాండ్**



**ప్రజాపక్షం/నస్పూర్ :** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసిన విద్యార్థిని అంజమ్మ విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్ని గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐఎస్బి ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండేపల్లి మండలానికి చెందిన అంజమ్మ పరీక్ష రాసినా ఫెయిల్ చేసి గైర్హాజరైనట్లు అధికారులు తప్పుడు ప్రకటన ఇవ్వడం దారుణమన్నారు. న్యాయం చేయాలని కలెక్టర్ను కోరితే విద్యార్థి తల్లిపై కేసులు పెట్టించారని ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారుల విచారణలో అమ్మాయి పరీక్ష రాసినట్లు నిర్ధారణ అయి మెమో జారీ చేశారని గుర్తు చేశారు. నెల రోజులుగా అధికారులు చేసిన ప్రచారంతో అంజమ్మ తీవ్ర మనోవేదనకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు నివేదిక ఇచ్చిన సీఎస్, కోఆర్డినేటర్, ఇన్విజిలేటర్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాపై స్పందించిన కలెక్టర్ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, కేసులు ఎత్తివేసి విద్యార్థి చదువుకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లి, జిల్లా అధ్యక్షుడు జతిన్, నాయకులు ఈశ్వర్, కిరణ్ పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై రైతులకు విజ్ఞప్తి

**జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ**



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ సూచించారు. మంగళవారం గుడిపేట రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ఎకరం వరి సాగుకు అయ్యే నీటితో నాలుగు నుంచి ఐదు ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. రైతు వేదికల్లో నిర్వహిస్తున్న విత్తన మేళాల్లో కందులు, పెసర, నువ్వులు, కూరగాయ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు మధుప రెడ్డి, సంతోష్ కుమార్‌లను జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మామిడి కృష్ణ, అత్మా ఛైర్మన్ సింగతి మురళి, ఎఓ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## రాజుర గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి



**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామానికి నైట్ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ విడిసి సభ్యులు గ్రామస్తులు నిర్మల్ డిపో మేనేజర్ కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో రాత్రి బస్సు సౌకర్యం ఉండేదని అలాగే పునః ప్రారంభం చేయాలని డిపో మేనేజర్ ని కోరడం జరిగిందని పొద్దున మరియు రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు అవుతున్నాయని ప్రయాణికుల సౌకర్యార్థం రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో వి డి సి వైస్ చైర్మన్ నర్సింగ్ రావు,క్యాషియర్ సాయిప్రసాద్,టీ కి శ్రీనివాస్, షాదుల్ల గంగాధర్ మరియు వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కార్మికులపై రికవరీలు రద్దు చేయాలి

**ఆళవందార్ వేణుమాధవ్**

**ప్రజాపక్షం/నస్పూర్ :** సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్ పేరుతో రికవరీ నోటీసులు జారీ చేయడం అన్యాయమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ అన్నారు. నస్పూర్ లో మంగళవారం ఆయన మాట్లాడారు. కంపెనీ అవసరాల కోసమే ఉద్యోగులు అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్ విధులకు వెళ్లారని, వారు స్వచ్ఛందంగా వెళ్లలేదని స్పష్టం చేశారు. అప్పట్లో నిబంధనల ప్రకారమే చెల్లించిన అలవెన్సులను ఇప్పుడు ఆడిట్ అభ్యంతరాల సాకుతో తిరిగి వసూలు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. వృద్ధాప్యంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులపై ఆర్థిక భారం మోపవద్దని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఉద్యోగుల పొరపాటు లేనప్పుడు రికవరీలు చేయరాదని గుర్తు చేశారు. యాజమాన్యం వెంటనే రికవరీ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## రహదారి సమస్యను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్‌సి దండే విఠల్‌కు గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. పోడు రైతుల సమస్యల పరిష్కారానికి మంగళవారం గ్రామానికి వచ్చిన ఆయనను కలిసి సమస్యను వివరించారు. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగేళ్ల క్రితమే టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారని పేర్కొన్నారు. వర్షాకాలంలో రాకపోకలు నరకంగా మారాయని, వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసేలా చూడాలని కోరారు. స్పందించిన ఎంఎల్‌సి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## స్మశానవాటికలో మొక్కలు నాటిన వి.డి.సి. సభ్యులు

**ప్రజాపక్షం/బోథ్ :** విజి జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా బోథ్ మండలం కౌఠ(బి) గ్రామంలోని మంగళవారం స్మశానవాటికలో గ్రామపంచాయతీ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.దాదాపు 200 మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ ఓరగంట స్వామి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి,పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,స్మశానవాటికలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా గ్రామానికి అందమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.విడిసి అధ్యక్షులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి గ్రామస్థుడి బాధ్యత , పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇట్టేడి రమణారెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ రామ్ సింగ్, గ్రామ కార్యదర్శి పి. అంజయ్య ,వీడిసి సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు సాగు చేయాలి

కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / సిర్పూర్‌టి:** ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు లేక చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గడం వల్ల వరి సాగు చేసి రైతులు నష్టపోవద్దని తెలిపారు. అదనపు ఆదాయం ఇచ్చే కూరగాయలు, పప్పు ధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ వద్ద విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంచాయతీ పాలకవర్గం, వ్యవసాయ అధికారులు సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాగా, మండలంలోని పారిగాం ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు వంద శాతం ఉండేలా బలోపేతం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆ తర్వాత లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యులు సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఎడి మనోహర్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపిడిఓ కోట ప్రసాద్, సర్పంచ్ ఓడేటి లావణ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న మెస్రం ఇందిరలాలాజీ దంపతుల ఇంటి స్లాబ్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ అధ్యక్షుడు డికొండ మహేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. సొంత ఇంటి కలను నిజం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహాయ సహకారాలు అందిస్తున్న నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రచయిత్రి సోతుకు రత్న జానకికు 'సాహితీవనం' పురస్కారం



**ప్రజాపక్షం/మందమర్రి:** మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన రచయిత్రి సోతుకు రత్న జానకి రచించిన కథ తెలుగు సాహితీవనం సంస్థ నిర్వహించిన కథల పోటీల్లో ఎంపికై తెలుగు సాహితీవనం కథా పురస్కారం సాధించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 26న నిర్వహించిన సాహితీవనం 9వ వార్షికోత్సవ సభలో ప్రముఖుల చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని, నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత్రి సోతుకు రత్న జానకి తన రచనల సంపుటాలను ప్రముఖులకు అందజేశారు. అనంతరం స్త్రీవాద రచయిత్రి ఓల్గా, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్, సాహితీవేత్తలు డాక్టర్ పెద్దింటి అశోక్, డాక్టర్ ఎస్ చంద్రయ్య, శాంతికృష్ణ చేతుల మీదుగా రత్న జానకి సన్మానం పొందారు. సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న తెలుగు సాహితీవనం సంస్థకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌనశ్రీ మల్లిక్, సత్యాజీ, తోట అరుణ, తంగెళ్ల శ్రీదేవి పాల్గొన్నారు.

# పలు గ్రామాలలో డిపిఒ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** మండల్ కేంద్రం మరియు న్యూ లోలం గ్రామ పంచాయతీలలో డిపిఓ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేసి డ్రై డే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.దీనిలో భాగంగా పారిశుధ్య పనులను మరియు డ్రై డే అవేర్నెస్ గురించి ఇంటి యజమానులతో చర్చించి ఇండ్లలో నీరు నిలవకుండా వారానికి రెండు రోజులు అనగా మంగళవారం మరియు శుక్రవారం శుభ్రం చేసుకోవడం వల్ల డెంగ్యూ మలేరియా తదితర విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు అలాగే పారిశుధ్య పనులను పరిశీలించారు అలాగే మండల కేంద్రంలోని దుకాణదారులకు ట్రేడ్ లైసెన్స్ ప్రతి సంవత్సరము తీసుకోవాలని అలాగే వాటిని రెన్యువల్ చేసుకోవాలన్నారు సింగిల్ ప్లాస్టిక్ ను పూర్తిగా తొలగించాలన్నారు నిర్లక్ష్యం వహిస్తే దుకాణదారులకు జరిమానాలు విధిస్తామన్నారు మండల కేంద్రంలోని PHC సందర్శించి మెడికల్ అధికారి డాక్టర్ ప్రియాంక తో సీజనల్ వ్యాధుల పట్ల చర్చించడం జరిగింది.ఇప్పటివరకు ఏమైనా జ్వరాలు నమోదు అయినాయని ఆరా తీశారు అలాగే జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫారం ఫండ్స్ మరియు బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ మరియు ఇంటికో ఇంకుడు గుంత అలాగే పంటకు పంట కుంట మరియు ఊరుకో ఊట గుంట మరియు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు మరియు డ్రైన్ ఎండ్ సోక్ నిర్మించాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సందర్శించి డైలీ వారి ప్రగతి నివేదికలను పరిశీలించారు. డిపిఓ వెంట మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ మరియు మెడికల్ ఆఫీసర్ ప్రియాంక మరియు సిహెచ్ఓ రాజేశ్వర్ స్థానిక ప్రజాప్రతినిధులు అనిల్,వార్డ్ మెంబర్లు అనిల్,హరుణ్ పంచాయతీ కార్యదర్శులు మహేందర్, అరుణ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ జెడ్‌పిటిసి

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్ నుండి చికిత్స నిమిత్తం ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యాంసుందర్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది.అలాగే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.వారి వెంట మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, సోషల్ మీడి యా మండల కన్వీనర్ బండి ప్రశాంత్,నాయకులు ప్రకాష్, శ్రీనివాస్, ప్రవీణ్, పాల్గొన్నారు.

## భైంసా ఎంఇఒ నిర్లక్ష్యంపై విచారణ జరపాలి

విద్యార్థి సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/భైంసా:** అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలపై ఫిర్యాదు చేసినా స్ప ందించని భైంసా మండల విద్యాధికారి వైఖరిపై శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎవైఎస్ఎస్‌జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ షితల్కర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్ నమత్కర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భైంసాలోని 'వేదం ఒలింపియాడ్' విద్యాసంస్థ ఎలాంటి గుర్తింపు, అనుమతులు లేకుండా నడుస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తోందని, వి ద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తోందని జులై 21న ఎంఇఒకు, జులై 22న జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు సమర్పించి రోజులు గడుస్తున్నా అధికారులు ఎలాంటి తనిఖీలు గానీ, చట్టపరమైన చర్యలు గానీ తీసుకోకపోవడం విచారకరమన్నారు. అధికారుల ఈ ఉదాసీనత వల్ల విద్యాశాఖ పనితీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంఈఓపై స్వతంత్ర శాఖాపరమైన విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉన్నతాధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పా టు చేసి సదరు విద్యాసంస్థపై సమగ్ర విచారణ జరపాలని, నిబంధనల ఉల్లంఘన రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుని విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం కో సం ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

## కాంగ్రెస్ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా సురేష్

**ప్రజాపక్షం/నేరడిగొండ:** కాంగ్రెస్ పార్టీ నేరడిగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగంపల్లి సురేష్ నియమితులయ్యారు. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## రాజురా గ్రామంలో మెగా మునగ ప్లాంటేషన్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** వన మహోత్సవంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని రాజూరా గ్రామపంచాయతీలో మంగళవారం మెగా మునగ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీమతి రాధా రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడుతూ, మునగతో పాటు పండ్ల చెట్ల పెంపకం ద్వారా గ్రామపంచాయతీకి భవిష్యత్తులో మంచి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు సమర్థవంతమైన వన సేవకుడిని నియమించి, వాటి పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, వాటి ద్వారా నాణ్యమైన సేంద్రియ ఎరువులు తయారు చేసి మొక్కలకు వినియోగించడంతో పాటు రైతులకు కూడా పంపిణీ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,సర్పంచ్,ఉపసర్పంచ్,ఏపీవో,పంచాయతీ కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ ఎంపీడీవో ఎల్. రమేష్, ప్రథమ్ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ పసుల రమేష్. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉచిత శిక్షణా కార్యక్రమాలను అందిస్తోందని బోథ్ ఎంపీడీవో ఎల్.రమేష్, ప్రథమ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదిలాబాద్ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ పసుల రమేష్ తెలిపారు. మంగళవారం బోథ్ మండలపరిషత్ కార్యాలయంలో టెక్నికల్‌అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు సంబంధించిన గోడ ప్రతులను (పోస్టర్లను) ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులకు పూర్తిగా ఉచితంగా 45రోజులపాటునైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. అందుబాటులో ఉన్న ఉచిత కోర్సులు: హోటల్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ ట్రైనింగ్ సోలార్ ఎలక్ట్రికల్ & టెక్నాలజీ వీలర్ & ఫోర్ వీలర్ మెకానిక్,బ్యూటీషియన్ శిక్షణ, టైలరింగ్ (కుట్టు శిక్షణ) ఉచిత సౌకర్యాలు శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం,వసతి, పూర్తిగా ఉచితంగా అందిస్తారు అని తెలిపారు. 45 రోజుల శిక్షణ పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సర్టిఫికేట్‌అందించడంతో పాటు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వివరించారు. ప్రతి గ్రామంలోని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన నిరుద్యోగ, యువతీ,యువకులను గుర్తించి తక్షణమే ఈసంస్థలో చేర్పించి వారికి ఉపాధి లభించేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జుట్టు నరేష్, ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కింది నంబర్లను 6303603145, 995 9865645 సంప్రదించండి.

## మిషన్ భగీరథ గ్రిడ్ పైప్ లైన్ డామేజ్ నీటి సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/పెంబి :** సమస్త పెంబి మండల గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు మరియు అధికారులకు తెలియ జేయునది ఏమనగా మిషన్ భగీరథ గ్రిడ్ పైపులైన్ కు పెంబి లో డ్యామేజ్ కావడం జరిగింది.ఇట్టి డ్యామేజ్ కారణంగా పెంబి మరియు పెంబి నుండి తదుపరి గల సమస్త గ్రామాలకు మిషన్ భగీరథ గ్రిడ్ నీటి సరఫరా నిలిచిపోయింది.కావున పై డ్యామేజ్ కి మరమ్మత్తులు చేసి నీటి సరఫరా తిరిగి పునరుద్ధరించేవరకు తగు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని మాకు సహకరించగలరని, మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె వెంకటరమణ,పెంబి మండల ప్రజలకు తెలియజేశారు.

## ఘనంగా సీతలా భవాని మాత వేడుకలు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని తాండాల్లో బంజారా గిరిజనుల ఆరాధ్య దైవమైన సీతలా భవాని మాత వేడుకలు మంగళవారం వైభవంగా సాగాయి. గిరిజనులు ఊరేగింపుగా గ్రామ పొలిమేరకు చేరుకుని అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో వ్యాధుల బారి నుంచి ప్రజలను, పశు సంపదను కాపాడుకోవడానికి ప్రతి ఏటా ఈ పూజలు నిర్వహించడం సంప్రదాయం. ఈ కార్యక్రమం ద్వారా సమస్త జీవరాశి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతున్నారు. కార్యక్రమంలో తండాల పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

## దరఖాస్తునకు 31 తుది గడువు

ప్రజాపక్షం/మోర్తాడ్‌: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో జవహర్ నవోదయ విద్యాల సమితి 2027–2028 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలు మోర్తాడ్ మండలంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 2026–2027 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు జహార్ నవోదయ విద్యాలయ సమితి 2027–28 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ సమ్మిరెడ్డి తెలిపారు. ఈ నెల 31వ తేదీ చివరి తేదని, అర్హులైన విద్యార్థులు వెంటనే తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి మండలంలోని మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మోర్తాడ్ మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలం మంగళపహాడ్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 300మంది ప్రజలకు వైద్యులు, బిపి, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ఈ శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల క్రమం తప్పకుండా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్షులు దుర్గారావు, కార్యదర్శి రమణారెడ్డి, సభ్యులు శ్రీనివాసరాజు, గాంధీ, చక్రవర్తి పాల్గొన్నారు. అలాగే ఎడపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాకేష్ వర్మ, కార్యదర్శి అరుణ్ కుమార్ గౌడ్, సభ్యులు గంగారెడ్డి, ప్రకాష్, మెర్సీ, పుష్పలత తదితరులు హాజరయ్యారు.

## ముగిసిన జలసిరి మండల స్థాయి సమావేశం



ప్రజాపక్షం/ముప్కాల్‌: భూగర్భజలాల పెంపుదల, నీటి సంరక్షణే ధ్యేయంగా మండల కేంద్రంలో 'జలసిరి' సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో 185 ఇంకుడు గుంతల నిర్మాణం, ఊర కుంటల పునరుద్ధరణ, పంట కుంటల ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలను మండల ప్రత్యేకాధికారి శంకర్ అందించారు. ఆగస్టు 15 లోగా అనుకున్న పనులను పూర్తి చేయాలన్నారు. బుధవారం గురువారం రోజుల్లో ఆయా గ్రామాల్లో జలసిరి కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేసుకోవాలనిసూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ ముంతాజోబుద్దీన్, ఎంపీఓ మధుకర్, మిషన్ భగీరథ ఏఈ అఫ్రిన్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## భీమ్‌గల్ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలి

### డాక్టర్ మధుశేఖర్

ప్రజాపక్షం/భీమ్‌గల్‌: భీమ్‌గల్‌లో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు కావటం ప్రాంత అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని డాక్టర్ మధుశేఖర్ అన్నారు. కోర్టు సాధన కోసం కృషి చేసిన గత, ప్రస్తుత వీడీసీ సభ్యులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టు అందుబాటులోకి రావటంతో చిన్నచిన్న సివిల్ వివాదాలు, ప్రమాదాలకు సంబంధించిన కేసుల విషయంలో ప్రజలు ఇకపై ప్రతిసారి ఆర్మూర్‌కు వెళ్లాల్సిన అవసరముండదని, దీంతో సమయం, ఖర్చు రెండు ఆదా అవుతాయన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఈ ప్రాంత విద్యార్థులు న్యాయవాదులు, న్యాయమూర్తులుగా ఎదగడానికి ఈ కోర్టు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భీమ్‌గల్ అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా అందరూ ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా, గ్రామాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలు, యువత, నాయకులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా కలిసి పని చేయాలని డాక్టర్ మధుశేఖర్ పిలుపునిచ్చారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు

### బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. బిజెవైఎం ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ మిస్ కాల్ ఉద్యమం ప్రారంభించారు. బిజెవైఎం జిల్లా అధ్యక్షులు వంశీగౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవటంతో వేలాది మంది విద్యార్థులు చదువును కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకవస్తున్నాయన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అప్పులు చేసి చదువుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడటం మానుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని యెడల ఇందూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే జిల్లావ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి భారీ ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వంశీగౌడ్, విజయ్‌కృష్ణ, విపుల్‌రావు, రాకేష్, రాజ్‌గణేష్, ఓంసింగ్, సాయిప్రవీణ్‌తో పాటు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలిసిన ఎంపి అర్వింద్



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లా పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి మంగళవారం న్యూఢిల్లీలోని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలన, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీనిచ్చారు. అదేవిధంగా ఇటీవల ఇందల్వాయి, జాన్కంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసినందుకు మంత్రికి ఎంపీ అరవింద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అరవింద్ తెలిపారు.

## పిఆర్‌టియు ముప్కాల్ మండల సభ్యత్వ నమోదు



ప్రజాపక్షం/ముప్కాల్: పీఆర్‌టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముప్కాల్ ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలలో మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండ్రు నవీన్ సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించామని అలాగే రానున్న రోజుల్లో ప్రభుత్వ మెనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ రద్దు పీఆర్‌టీయు బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సునీత, కేజీబీవీ ఇన్‌చార్జి మేడం శ్యామల, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరేందర్, ప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ, మండల అసోసియేట్ అధ్యక్షులు రవికుమార్, మహిళ ఉపాధ్యక్షురాలు ఇందిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లు కోసం నిరసన

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంటు సమావేశాలలో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిసి హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా పార్లమెంటులో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పుడు కాంగ్రెస్ ఇప్పుడు బిజెపి పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్లమెంటులో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బిమ్సేన్, అశోక్, చంద్రమౌళి, అంకం సతీష్, రాజన్న, లతీఫ్, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లె 'జలసిరి' కావాలి




ప్రజాపక్షం/మాక్లూర్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జలసిరి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పాల్గొని మాట్లాడారు. మండలంలోని ప్రతి పల్లె జలసిరిగా విరబూయాలన్నారు. భూగర్భజలాల పెంపుదల, గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటుతో నీటి సంరక్షణే ధ్యేయంగా, ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు తమ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఎల్‌నినో ఎఫెక్ట్‌తో భూగర్భజలాలు అడుగుంటి జలసిరి సమావేశంలో ప్రతి గ్రామానికి ఇంకుడు గుంతల నిర్మాణం, ఊర కుంటల పునరుద్ధరణ, పంట కుంటల ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మహిళా సమాఖ్య అధ్యక్షుల సభ్యులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరన్, ఎంపీఓ రాజేష్, ఇన్‌చార్జి ఎపిఒ విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అనిల్, గ్రామస్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకం

### సర్పంచ్ పుప్పాల నరేష్

ప్రజాపక్షం/మోర్తాడ్‌: మహిళా భవన నిర్మాణ పనులు నాణ్యతను నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్ మంగళవారం పరిశీలించారు. నిజామాబాద్ జిలా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మహిళా సాధికారతే లక్ష్యంగా రెండు నెలల క్రితం ప్రారంభించిన వివో(స్వయం సహాయక సంఘాల) భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం రోజు నిర్మాణ పనుల స్థలాన్ని సర్పంచ్ నరేష్ స్వయంగా సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఈ నిర్మాణంలో వాడుతున్న మెటీరియల్ నాణ్యతను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళల సౌకర్యార్థం అత్యుత్తమ ప్రమాణాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పనుల వేగం ఇదే విధంగా కొనసాగించి, రానున్న నాలుగు నుంచి ఐదు నెలల వ్యవధిలో భవనాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఉప సర్పంచ్ సదానంద్, వార్డ్ సభ్యులు పత్రి రమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ఎడపల్లి: బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బిల్లా రామ్మోహన్ జన్మదిన వేడుకలను ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జాన్కంపేట్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయులతో కలిసి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అలాగే ఎడపల్లి మండల కేంద్రంలో రామ్మోహన్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు అధ్యక్షతన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం చేపట్టి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, పార్టీ శ్రేణులు రక్తదాన శిబిరంలో పాల్గొని రెడ్ క్రాస్‌కు రక్తాన్ని అందించి తమ గొరవాన్ని చాటుకున్నారు. అలాగే మండల సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ వేడుకల్లో ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.